క్లుప్తంగా

నూతన కాంతులు వెదజల్లాలి

ఎల్లారెడ్డి: సంక్రాంతి పండగ అందరి జీవితాలలో నూతన కాంతులు వెదజల్లాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గ ప్రజలకు ఆయన సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి పండగ అందరికి శుభాలను కలిగించాలని ఆకాంక్షించారు.

కొనసాగుతున్న చెరుకు క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అడ్లూర్‌ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ముమ్మరంగా కొనసాగుతుంది. శుక్రవారం నాటికి లక్షా 83 వేల 967 టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

క్రికెట్ పోటీలు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో ఆదివారం ఆకిటి శ్రీకాంత్‌రెడ్డి జ్ఞాపకార్థం టీపీఎల్ 17వ వార్షికోత్సవం సందర్భంగా క్రికెట్ పోటీలను నిర్వహించారు. తాడ్వాయికి చెందిన 120 మంది క్రీడాకారులు ఎనిమిది టీంలుగా ఏర్పడి ఆడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, సర్పంచ్ సంజీవులు, వైస్ఎంపీపీ నర్సిములు, ఎస్సై ఆంజనేయులు, క్రీడల కన్వీనర్ రనీల్‌రెడ్డి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

అంబారిపేటలో ..



దోమకొండ: అంబారిపేటలో జైభీం ఆధ్వర్యంలో రెండు రోజుల నుంచి క్రీడాపోటీలను నిర్వహిస్తున్నట్లు క్రీడా నిర్వాహకులు నిమ్మ వినీత్ ఆదివారం తెలిపారు. క్రికెట్, కబడ్డీ, వాలీవాల్ పోటీలను నిర్వహించగా, అంబారిపేట, కోనాపూర్ గ్రామాలకు చెందిన 26 టీంలు పాల్గొన్నాయన్నారు. వీరిలో గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేశారు. జైభీం వార్షికోత్సవం సందర్భంగా పోటీలను నిర్వహించామని అన్నారు.

ముగిసిన ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం



తాడ్వాయి(ఎల్లారెడ్డి): చిట్యాలలో వారం రోజుల క్రితం ప్రారంభమైన ఎన్ఎస్ఎస్ కార్యక్రమం ఆదివారం ముగిసింది. తాడ్వాయి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు గ్రామంలో పలు కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి పలు అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. సర్పంచ్ కవిత, ఎంపీటీసీ రాజమణి, ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీకాంత్, అధ్యాపకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆలయాల శుద్ధీకరణ కార్యక్రమాలు

బిచ్కుంద(జుక్కల్): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు ఆలయాల శుద్ధీకరణ, స్వచ్ఛత కార్యక్రమం చేపట్టినట్లు బిచ్కుంద బండాయప్ప మఠం పీఠాధిపతి శ్రీ సోమాయప్ప స్వామి అన్నారు. మార్పు కోసం ఒక అడుగు అనే అంశంపై స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం బిచ్కుందలో కాశి విశ్వనాథ స్వామి ఆలయంలో శుద్ధీకరణ, స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించారు. ఆవరణలో పిచ్చిమొక్కలు తొలగించి పరిసరాలను నీటితో శుభ్రంగా కడిగి శుద్ధి చేశారు. ప్రతి గ్రామంలో శుద్ధి కార్యక్రమాలు జరుగుతాయని, ప్రతి ఒక్కరు భాగస్వామ్యం దేవుని భక్తి చాటిచెప్పాలని సోమయప్ప స్వామి కోరారు.

వీధి కుక్కల బెడద

భిక్కనూరు: పెద్దమల్లారెడ్డి గ్రామంలో వీధి కుక్కలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రజలతో పాటు గొర్రెమేకల పెంపకందారులు సైతం ఇబ్బంది పడుతున్నారు. చిన్న గొర్రె మేక పిల్లలపై వీధి కుక్కలు దాడులు చేస్తూ గాయపరుస్తున్నాయి. అలాగే గ్రామంలో పలు వాహనదారులపై దాడులకు దిగి గాయపరుస్తున్నాయి. వెంటనే జీపీ అధికారులు స్పందించి వీధి కుక్కల బెడదనుంచి రక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

29వసారి రక్తదానం



కామారెడ్డి టౌన్: పట్టణానికి చెందిన ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్ రాజాగౌడ్ ఆదివారం 29వ సారి రక్తదానం చేశారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో అప్పుడే జన్మించిన శిశువుకు అత్యవసరంగా 'ఎ' నెగటివ్ రక్తం అవసరం కావడంతో రాజాగౌడ్ స్పందించి రక్తదానం చేశారు. జంగం నరేష్, శివకుమార్ తదితరులున్నారు.

సందడిగా సంక్రాంతి సంబురాలు

జిల్లాలో ఆదివారం సంక్రాంతి సంబరాలు సందడిగా కొనసాగాయి. ఈ సందర్భంగా గ్రామాలు, పట్టణాల్లో మహిళలకు ముగ్గుల పోటీలు, చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రత్యేకంగా బహుమతులు అందించారు. పండుగ సందర్భంగా గాలిపటాలు, రంగుల దుకాణాలు భారీగా వెలిశాయి.

– సాక్షి నెట్‌వర్క్



సంగంలో ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతి అందిస్తున్న గ్రామస్తులు



ముగ్గుల్లో రంగులు నింపుతున్న చిన్నారి



బాన్సువాడ వరసిద్ధి వినాయక ఉత్సవ సమితి ఆధ్వర్యంలో..



బీర్కూర్ మండలం రైతునగర్‌లో..



జిల్లా కేంద్రంలో ముగ్గు వేస్తున్న మహిళ



పిట్లంలో వెలసిన రంగుల దుకాణాలు



ఎల్లారెడ్డిలో కొనుగోలు చేస్తున్న మహిళలు

ఆదివారమే పండుగలా..

- సందడిగా మటన్ మార్కెట్
- సోమవారం కొంత మందికి ఒక్కపొద్దులే కారణం



బీబీపేటలో మటన్ షాపుల వద్ద ప్రజలు

బీబీపేట: సంక్రాంతి పండుగ సోమవారం రావడం, దానికి తోడు కొంత మంది ప్రజలు సోమవారం రోజున ఒక్క పొద్దులు ఉండడంతో పల్లెల్లోని ప్రజలందరు ఆదివారం రోజునే సంక్రాంతి పండుగను జరుపుకున్నారు. నాన్‌వెజ్ ప్రియులకు ఆదివారం కలిసి రావడంతో ఉదయం నుంచే మటన్, చికెన్ షాపుల ముందు బారులు తీరారు. చాలా గ్రామాల్లో ఏ కాలనీల్లో చూసినా పండుగ వాతావరణం కనిపించేలా ముగ్గులు వేయడం, గొబ్బెమ్మలు పెట్టడం, పతంగులు ఎగురవేయడం లాంటివి చేశారు. అలాగే నేడు చాలా మంది మహిళలు ఒక్కపొద్దులు పట్టడంతో ఆదివారం పండుగను జరుపుకోవడానికి, నాన్‌వెజ్ తినడానికి అనుకూలంగా ఉండడమే కారణం కావడంతో సంక్రాంతిని జరుపుకున్నారు. పల్లెల్లో పూర్తిగా నిన్ననే సంక్రాంతి శోభ కనిపించడం, పల్లెలు మొత్తం సందడిగా మారడం, మార్కెట్లు సైతం ఎక్కువగా రద్దీగా కనిపించాయి.

బీటీ రోడ్లపై కేజ్‌వీల్ ట్రాక్టర్లు

- ధ్వంసమవుతున్న రోడ్లు



బోర్లంలో రోడ్డుపై వెళ్తున్న కేజ్‌వీల్ ట్రాక్టర్

బాన్సువాడ రూరల్: ప్రస్తుతం యాసంగి వరినాట్లు ముమ్మరంగా సాగుతుండటంతో కేజ్‌వీల్స్‌తో కూడిన ట్రాక్టర్‌లను రోడ్లపై నుంచి పంటపొలాలకు తీసుకెళ్తున్నారు. దీంతో చక్కటి బీటీ, సీసీ రోడ్లు ధ్వంసం అవుతున్నాయి. రూ.లక్షలు వెచ్చించి వేసిన కొత్త రోడ్లు పాడైపోయి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. పట్టీలు వేయని కేజ్‌వీల్స్ రోడ్లపై తిప్పితే జరిమానా తప్పదని ఓవైపు అధికారులు హెచ్చరిస్తున్నా పెడచెవిన పెడుతున్నారు. రెవెన్యూ, పోలీస్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ట్రాక్టర్ యజమానులకు అవగాహన కల్పించాలని, వినకపోతే భారీజరిమానాలు విధించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

- వంగిన విద్యుత్ స్తంభాలు
- చేతికి అందే ఎత్తులో విద్యుత్ తీగలు
- కట్టెల సాయంతో విద్యుత్ వైర్లు ఎత్తి ఉంచిన రైతులు
- పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు



విఠల్‌వాడి తండాలో చిన్న పిల్లలు ఆడుకునే ప్రదేశంలో ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



పోచారం తండా -విఠల్ వాడి తండా దారిలో విద్యుత్ వైర్లను కట్టె సాయంతో పైకి ఎత్తి ఉంచిన దృశ్యం

పెద్దకొడప్‌గల్(జుక్కల్): విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా పెద్దకొడప్‌గల్ మండలంలోని పోచారం తండా నుంచి విఠల్ వాడి తండాకు వెళ్లే రహదారిలో చేతికి అందే ఎత్తులో విద్యుత్ వైర్లు వేలాడుతూ ఉన్నాయి. దీంతో కట్టె సాయంతో రైతులు పైకి ఎత్తి ఉంచారు. విద్యుత్ స్తంభాలు వంగిపోయి అస్తవ్యస్తంగా మారాయి. పంట పొలాల్లో విద్యుత్ తీగల పరిస్థితి అధ్వానంగా తయారైంది. అదేవిధంగా సముందర్ తండాలో విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరుకొని కూలిపోయే పరిస్థితి ఉందని, విద్యుత్ అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని తండా వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలే వర్షాకాలం పంట పొలాల్లోకి వెళ్లాలంటే భయంగా ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అస్తవ్యస్తంగా ఉన్న విద్యుత్ స్తంభాలు సరి చేసి, ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచె వేసి మూగజీవుల ప్రాణాలు కాపాడాలని రైతులు కోరుతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను సరిచేయాలి

పోచారం తండా నుండి విఠల్ వాడి తండా వెళ్లే దారిలో చేతికి అందే ఎత్తులో ఉన్న విద్యుత్ వైర్లు ఉన్నాయి. అలాగే మా పంట పొలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కిందికి ఉంది. ఉన్నత అధికారులు స్పందించి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పైకి పెట్టించి, దాని చుట్టూ కంచె ఏర్పాటు చేయాలి..విద్యుత్ వైర్లు సరి చేయాలని కోరుతున్నాం..

– బర్థావల్ సుధర్, పోచారం తండా

శిథిలావస్థకు చేరుకున్నాయి

తండాలో విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ముట్టుకుంటే ఎర్తింగ్ వస్తోంది. ఎక్కువగా గాలి వీచినప్పుడు ఇళ్లపై పడిపోతాయేమోనని భయాందోళన చెందుతున్నారు. స్థానిక జేఎల్ఎంకు చెప్పినా పట్టించుకోవడం లేదు. పై అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి మరమ్మతులు చేయించాలని కోరుతున్నాం.

– రాందాస్, సముందర్‌తండా

మా దృష్టికి రాలేదు

ఇప్పటి వరకు మా దృష్టికి రాలేదు. పోచారం తండా నుంచి విఠల్ వాడి తండాకు వెళ్లే రహదారిలో విద్యుత్ వైర్లను, వంగిన స్తంభాలను రెండు రోజుల్లో సరి చేస్తాం. అలాగే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ల చుట్టూ కంచె వేసేలా చర్యలు తీసుకుంటాం.

– సాయినాథ్ గౌడ్, పెద్దకొడప్‌గల్, ఇన్‌చార్జి మండల విద్యుత్ అధికారి

వైభవంగా గోదాదేవి కల్యాణం



బీబీపేటలో కల్యాణం జరుపుతున్న భక్తులు



దోమకొండ లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో..



చుక్కాపూర్‌లో..



మద్నూర్‌లో ఊరేగింపు నిర్వహిస్తున్న మార్వాడీలు

సాక్షి నెట్‌వర్క్: జిల్లాలోని పలు ఆలయాల్లో ఆదివారం గోదాదేవి-రంగనాయకుల స్వామి కల్యాణం వైభవంగా జరిగింది. బీబీపేట మండల కేంద్రంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో, దోమకొండ మండల కేంద్రంలోని లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో, మాచారెడ్డి మండలం చుక్కాపూర్ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో, మద్నూర్ మండల కేంద్రంలోని బాలాజీ మందిరంలో భక్తిశ్రద్ధలతో కల్యాణం జరిపించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

ముగిసిన ధనుర్మాస వజ్రోత్సవాలు



పూజలు చేస్తున్న అర్చకులు

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి పెద్దబజార్‌లోని వేణుగోపాల స్వామి ఆలయంలో నెలరోజులుగా నిర్వహిస్తున్న 50వ (పంచాశ) ధనుర్మాస వజ్రోత్సవాలు ఆదివారం స్వామి కల్యాణంతో ముగిశాయి. గుండి రంగాచార్యులు నెలరోజుల పాటు భక్తులనుద్దేశించి తిరుప్పావై ప్రవచనాలు చేశారు. కార్యక్రమంలో ధనుర్మాస ఉత్సవ కమిటీ, వికాస తరంగిణి, గంజు వర్తక సంఘం, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మమ్మ జాతర

గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని చద్మల్ తాండాలో లక్ష్మమ్మ గుడివద్ద జాతర ఆదివారం ఘనంగా జరిగింది. తండాలో ప్రతి ఏటా సంక్రాంతి పండుగ రోజు లక్ష్మమ్మ గుడి వార్షికోత్సవాలు నిర్వహిస్తారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఆదివారం పండుగను ఘనంగా నిర్వహించారు. గుడిలో ప్రత్యేక పూజలు చేసి గుడి చుట్టూ ఎడ్ల బండ్ల ప్రదర్శన జరుపుతారు. గుడివద్ద పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భారీ సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.



ఓటమి గెలుపునకు నాంది



విజేతలతో నిర్వాహకులు

లింగంపేట(ఎల్లారెడ్డి): గెలుపు ఓటములను క్రీడాకారులు సమానంగా తీసుకొని ఓటమిని గెలుపునకు నాంది పలకాలని విశ్రాంత ఉపాధ్యాయుడు ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఆదివారం ముస్తాపూర్‌లో నిర్వహించిన మండల స్థాయి వాలీబాల్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండల స్థాయి క్రీడలు స్నేహ భావంతో నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. మండల స్థాయి క్రీడల్లో మోతె జట్టు ప్రథమ స్థానంలో నిలిచి రూ. 6000 నగదు, ముస్తాపూర్ ద్వితీయ స్థానంలో నిలిచి రూ. 3000 నగదు బహుమతి గెలుపొందినట్లు తెలిపారు.

రోడ్డు పనుల ప్రారంభంతో హర్షం



మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని పాత ఎస్ఎన్‌పి రోడ్డుపై నూతన రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారి సర్వీస్ రోడ్డు నుంచి మద్నూర్ వరకు ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతినడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత బీటీ రోడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.7.50 కోట్లు మంజూరు చేసి పనులు ప్రారంభించడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సమాచారం..

నేడు అయ్యప్ప ఆలయంలో ఉత్సవాలు

కామారెడ్డి అర్బన్: సంక్రాంతి సందర్భంగా సోమవారం సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు స్థానిక అయ్యప్ప ఆలయంలో ఉత్సవాలు నిర్వహించనున్నట్టు స్వామి అయ్యప్ప సేవా సంఘం, అన్నప్రసాద సేవా సమితి తెలిపింది. భక్తులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని సేవా సమితి విజ్ఞప్తి చేసింది.

సంక్రాంతి నోములు

కామారెడ్డి అర్బన్: సంక్రాంతి సందర్భంగా సోమవారం ఉదయం 11 గంటలకు స్థానిక శ్రీవిశ్వనాథేశ్వర ఆలయంలో శివపార్వతీ కల్యాణం, సంక్రాంతి నోములు, తులసీ కల్యాణం నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకులు శివకుమార్ తెలిపారు. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

స్నేహపురి పార్కు అభివృద్ధి కమిటీ కార్యవర్గం



ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి పట్టణం స్నేహపురి కాలనీ పార్కు అభివృద్ధి కమిటీ కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గ్యార సాయిలు, ఉపాధ్యక్షులుగా బెజ్జంకి నాగేందర్, ఎండీ సాహెబ్‌బాబు, ప్రధాన కార్యదర్శిగా బింగి బాల్‌రాజు, సంయుక్త కార్యదర్శులుగా లోలం శ్రీనివాస్, గోరింటాల ప్రకాష్, కోశాధికారిగా తాటిపల్లి రమేష్, సంయుక్త కోశాధికారిగా బందెల మారుతి, కార్యవర్గసభ్యులుగా రాజిరెడ్డి, సంతోష్, మలహరి, కిరణ్‌రెడ్డి, విజయ్‌కాంత్, సలహాదారులుగా జీవన్‌రెడ్డి, ఎస్.బాలకిషన్, తదితరులు ఎన్నికయ్యారు.

కాషాయ తోరణాల ఏర్పాటు



భిక్కనూరు: అయోధ్యలో శ్రీబాల రాముని విగ్రహం ప్రతిష్ఠాపన మహోత్సవం సందర్భంగా భిక్కనూరు మండల కేంద్రంలో శ్రీరామ దండు ఆధ్వర్యంలో కాషాయ తోరణాలను ఏర్పాటు చేస్తున్నారు. పలువురు శ్రీరామ దండు ప్రతినిధులు ఉద్యోగాలు చేస్తుండగా కొందరు వ్యాపారులు ఉన్నారు. వారందరూ తమ పనులకు సెలవులు పెట్టి మండల కేంద్రంలో ఈనెల 22న నిర్వహించనున్న కార్యక్రమాల కోసం అహర్నిశలు కృషి చేస్తుండటాన్ని పలువురు అభినందిస్తున్నారు.

హోరాహోరీగా ఆర్‌పీఎల్



టోర్నమెంట్‌లో పాల్గొన్న క్రీడాకారులు

రామారెడ్డి (ఎల్లారెడ్డి): రామారెడ్డి గ్రామంలో సంక్రాంతి సెలవుల సందర్భంగా రామారెడ్డి ప్రీమియం లీగ్(ఆర్‌పీఎల్) సెషన్-4 ఆదివారం 3వ రోజు హోరాహోరీగా కొనసాగింది. టోర్నమెంట్ నేడు నిర్వహించే మ్యాచ్‌తో ముగుస్తుంది. టోర్నమెంట్లో 6 టీంలు పోటీ పడగా ఫైనల్ మ్యాచ్ సోమవారం నిర్వహించనున్నారు. మొదటి బహుమతిగా రూ.11వేలు, ట్రోఫీ, ద్వితీయ బహుమతి రూ.8 వేలు ట్రోఫీ అందించనున్నట్లుగా నిర్వాహకులు తెలిపారు.